క్లుప్తంగా

పాల ఉత్పత్తిదారుల సంక్షేమ పథక చెక్కు పంపిణీ



పెదకూరపాడు: పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా సంగం డెయిరీ కృషి చేస్తోందని డైరెక్టర్ వలివేటి ధర్మారావు తెలిపారు. 75త్యాళ్ళూరు పాల కేంద్రం సభ్యుడు చిలువూరి లింగయ్య ఆగస్టు 2న మరణించారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమ పథకం కింద నామిని అయిన భార్య భవానికి యాభై వేల రూపాయల చెక్కును, పదివేల నగదును శనివారం అందించారు. కార్యక్రమంలో ఉంగుటూరు బీఎంసీ ఇన్‌చార్జ్ ఆనంద్, సూపర్‌వైజర్ బాజీబాబు, పాల కేంద్రం అధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి ఈదా అజయ్ కుమార్ రెడ్డి, చిలువూరి రమేష్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన అవసరం



సత్తెనపల్లి: జీఎస్టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పణిదం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివదుర్గారావు తెలిపారు. పట్టణంలోని ఆప్కో షోరూం వద్ద శనివారం జీఎస్టీ తగ్గింపుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై 18 శాతం ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించిందని తెలిపారు. యారన్‌పై అంతే ఐదు శాతాన్ని ఉంచిందని చెప్పారు. జీఎస్టీ తగ్గింపుపై హ్యాండ్లూమ్స్ ఏడీ రాఘవరావు, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ మేనేజర్ బాషా వివరించారు. సమావేశంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

సజావుగా అంగన్‌వాడీల ఇంటర్వ్యూలు



సత్తెనపల్లి: పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని తొమ్మిది అంగన్‌వాడీ వర్కర్లు, 29 హెల్పర్ పోస్టులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణా కాంతరెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి, సత్తెనపల్లి, క్రోసూరు సీడీపీవోలు టి.శ్రీలత, ఎస్. వెంకట రమణలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఐదు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 8 మంది దరఖాస్తు చేసుకొని, ఇంటర్వ్యూలకు హాజర య్యారు. 13 హెల్పర్ పోస్టులకుగాను 18 మంది దరఖాస్తు చేసుకోగా 16 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నాలుగు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు ఏడుగురు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 16 హెల్పర్ పోస్టులకు 16 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ తీగెలు వేసేదెప్పుడు? .



అచ్చంపేట: భారీ వర్షాలకు విద్యుత్ తీగెలు తెగి ఏడాదైనా విద్యుత్ శాఖ అధికారుల్లో చలనం లేదు. కొత్త తీగె వస్తుంది...వేస్తాము ! అంటూ దాటేస్తున్నారు. మండలంలోని కోగంటివారిపాలెంలో గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు చింతలపాటి ప్రసాద్ ఇంటి నుంచి రాంభూపాలరెడ్డి ఇంటి వరకు సుమారు 20 మీటర్ల మేర విద్యుత్ తీగెలు పూర్తిగా తెగిపోయాయి. ఈ దుస్థితి ఇక్కడ ఒక్కచోటే కాదు.. ఈ చిన్న గ్రామంలో మూడు, నాలుగు చోట్లు ఇలానే తీగెలు తెగి పోయినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు చీకట్లో కాలం గడుపుతున్నారు. గ్రామ సర్పంచ్ బోనం నాగిరెడ్డి మాట్లాడుతూ తమది చిన్న గ్రామం అంటూ అధికారులు చిన్న చూపు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపించారు. వర్షం పడితే గంటల తరబడి విద్యుత్ ఆగిపోతుందని, సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. దోమల బాధతో నిద్రలేని రాత్రిళ్లు గడుపుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ తీగెలు వేయడంతో పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని సర్పంచ్ కోరారు.

మిర్చి సాగుపై రైతులు వెనుకంజ

- గత ఏడాది తీవ్ర నష్టాలు
- ఏటేటా పెరుగుతున్న సాగు వ్యయం
- ఆదుకోని కూటమి ప్రభుత్వం



మాదలలో సాగు చేసిన మిర్చి పంట

ముప్పాళ్ల: మిర్చి సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. వరుసగా రెండేళ్లు తీవ్ర నష్టాలు వస్తుండటంతో వెనకడుగు వేస్తున్నారు. పెట్టుబడి వ్యయం పెరగడం, ఎరువుల కొరత, కూలీల ధరలు రెట్టింపు కావడం, తెగుళ్ల నివారణకు ఖరీదైన పురుగు మందులు వాడాల్సి రావడంతో సాగు పరిస్థితి మరింత భారంగా మారింది. దీనికి తోడు గతేడాది పంటకు కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఎకరాకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు చూపు

తమది రైతు ప్రభుత్వం అని కూటమి నేతలు చెప్పడమే తప్పా ఆ దిశగా వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టలేదు. అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నా స్పందన లేదు. మిరప సాగులో రైతులు నష్టాలు చవి చూస్తున్నారు. బోరు బావుల కింద సాగు చేసే మిరప పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ఎక్కువ శాతం మక్కువ చూపుతున్నారు. మండలంలో గత ఏడాది 1,664 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 968 ఎకరాల్లో మాత్రమే మిర్చి పంట సాగు చేశారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. మద్దతు ధరతో పాటు పంట నష్టపరిహారం అందించి ఆదుకుంది. సమయానికి రైతు భరోసా సాయం అందించి వెన్నుదన్నుగా నిలిచింది. సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు గ్రామంలోనే అందేలా సౌకర్యాలు కల్పించి, నకిలీలను అరికట్టింది. గతంలో మిర్చి క్వింటా రూ.20వేలు నుంచి రూ.25వేల వరకు ధర పలికింది. రెండేళ్ల నుంచి క్వింటా రూ. 8వేల నుంచి రూ.13వేలకు పడిపోయింది. మిర్చి రైతులు ఎన్నడూ లేని నష్టాలు ఈ రెండేళ్లలో చవిచూడాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ ఏడాది పంట నష్టపరిహారం అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అన్నదాతలు విమర్శిస్తున్నారు.

ప్రభుత్వం నుంచి సహకారం కరువు

రైతులు ఏ పంట వేసినా నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేకపోవడం, పెట్టుబడి సాయం చేయకపోవడం, గిట్టుబాటు, ధర కల్పించి భరోసా కల్పించకపోవడం వెరసి రైతులు నష్టాల బాట పడాల్సిన పరిస్థితి నెలకొంది. మిర్చి పంటకు మొదటి నుంచి ఖరీదైన ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది.

తెగుళ్ల బెడద కూడా ఎక్కువ. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాలి. పంట ఎక్కువగా సాగు చేసినా ధరలు పడిపోవడంతో నష్టాలు తప్పలేదు. దీంతో రైతులు అయోమయంలో పడిపోయారు. ఈ ఏడాది మిర్చి పంట సాగుకు ఆసక్తి చూపడం లేదు. ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, అరటి, బొప్పాయి పంట సాగుకు మళ్లుతున్నారు.

నష్టాలతో సాగు తగ్గించా !



గత ఏడాది ఆరు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశా. కనీసం పెట్టుబడి రాకపోగా మొత్తం ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది రెండకరాల్లోనే సాగు చేస్తున్నా. వర్షాలు అధికంగా ఉండటంతో పంట ఎదుగుదల లోపిస్తోంది. ఈ ఏడాదైనా మద్దతు ధర లభిస్తుందనే ఆశతో సాగు చేస్తున్నా.

–బత్తుల ఏడుకొండలు, చాగంటివారిపాలెం

పెట్టుబడి బాగా పెరిగింది



ఏటేటా సాగు ఖర్చు బాగా పెరిగి పోతోంది. ఎకరం సాగు చేయాలంటే లక్ష రూపాయలు ఖర్చు అవుతోంది. పోయిన సంవత్సరం రెండెకరాల్లో మిరప పంట సాగు చేస్తే లక్షన్నర నష్టం వచ్చింది. ఈ ఏడాది ఎకరంలోనే సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నా.

–గంజి శ్రీనివాసరావు, దమ్మాలపాడు

అంబేడ్కర్ విగ్రహ దహనం హేయం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిలుకా జైపాల్



సత్తెనపల్లి: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టిన వారిని ప్రభుత్వం వెంటనే శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిలుకా జైపాల్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి సర్కారులో దళితులపై నిత్యం దాష్టికాలేనని, దీనిలో భాగంగానే చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన టీడీపీ నేత సతీష్ నాయుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితుల గ్రామ బహిష్కరణలు, అంబేడ్కర్ విగ్రహాలకు అపచారం నిత్య కృత్యమైందని విమర్శించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దళిత ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతాడని తెలిపారు. అంబేడ్కర్ భావజాలాలపై టీడీపీ ఆది నుంచి విషం చిమ్ముతోందని మండిపడ్డారు. దళితుల ఆత్మగౌరవం నిలబెట్ట డానికి అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున విలువైన స్థలంలో రూ.450 కోట్లతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత విగ్రహాన్ని చూసి తట్టుకోలేక స్మృతి వనంలో లైటింగ్ తీసివేయించారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని, దళితుల ఆత్మగౌరవం దెబ్బతినకుండా చూడాలని ఆయన కోరారు.

దుండగులను వెంటనే అరెస్టు చేయాలి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రవిబాబు



మాట్లాడుతున్న రవిబాబు

సత్తెనపల్లి: అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి గంజిమాల రవిబాబు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు కలిసి శనివారం నిరసన తెలిపారు. దళిత బహుజన ఫ్రంట్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నందిగామ చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవిబాబు మాట్లాడారు. దళితులకు, నాయకులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహం కాల్చడం అంటే దళితుల ఆత్మ గౌరవం కాల్చినట్టేనని ఆయన మండిపడ్డారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని తెలిపారు. దళిత మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరబండి ఆంథోనీ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన వారిని అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేవారు. సీనియర్ న్యాయవాది దాసరి జ్ఞానరాజ్‌పాల్ మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షంచాలని కోరారు. బహుజన సమాజ్ పార్టీ నియోజక వర్గ నాయకులు కుక్కమళ్ల దేవానంద్ మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాల వద్ద పోలీస్‌లు నిఘా నేత్రలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోడిరెక్క దేవదాసు, జూపల్లి పాల్, పెద్దింటి నాగేశ్వరరావు, పద్మారావు, నాయకులు మాదంశెట్టి వేదాద్రి, సిద్దిల మోహన్, శేఖర్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు తలతోటి కోటేశ్వరరావు, మాలపాటి విజయ్ కుమార్, బందారు రవి, జై భీమ్‌రావు భారత్ పార్టీ నాయకులు జాన్‌బాబు, అంబేడ్కర్ ప్రజా సంఘం నాయకులు దావులూరి కోటేశ్వరరావు, అంబేడ్కర్ యువ జన సంఘం నాయకులు పాల్ రాజ్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 40మంది ఎంపిక



కంపెనీ ప్రతినిధులతో ఉద్యోగాలు పొందిన యువత

అమరావతి: మండల పరిధిలోని ధరణికోట శ్రీరామ్ ఐటీఐలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో బ్లూస్టార్ క్లైమెటెడ్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రీమియర్ ప్రి ఎనర్జీస్, ఏషియన్ ఆటో పార్ట్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీల హెచ్‌ఆర్‌లు బాలాకుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలలో 40 మందిని ఎంపిక చేసినట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నంబూరు బుజ్జిబాబు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ అనంత మల్లిఖార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

ముప్పాళ్ల: విద్యతోనే సమాజం మారుతుందని కృష్ణాజిల్లా కార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ కె.బేబీ చెప్పారు. ముప్పాళ్లలో శనివారం బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ల సమావేశం నిర్వహించారు. కార్డ్స్ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ కె.జగదీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బేబీ మాట్లాడారు. పేద పిల్లలను విద్యావంతులు చే సేందుకు బాలబాట నాలుగు అంశాలతో విద్యను అందిస్తోందని తెలిపారు. ఆటపాటలతో పాటుగా పెరటి తోటల పెంపకం ద్వారా స్వయం సహాయక జీవన విధానంతో కూడిన విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా డెప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బాలబాట ద్వారా గురుకుల పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సంస్థ ఆర్గనైజర్లకు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు పి.అరుణ, బి.మంజుల పాల్గొన్నారు.

ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరణలో పాల్గొన్న వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు

సత్తెనపల్లి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ చలో విజయవాడ పేరుతో ఈనెల 7న జరిగే ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం అన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12వ పీఆర్సీ, 30 శాతం ఐఆర్, డీఏ, ఎరియర్స్, కారుణ్య నియామకాలు, ఏకీకృత సర్వీస్ రూల్స్, సీపీఎస్ రద్దు, అసెస్‌మెంట్‌బుక్స్ విధానం రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్లను సాధించాలంటే వేలాది సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మక్కెన శ్రీనివాసరావు, చిన్నం శ్రీనివాసరావు, బి. శ్రీనివాసరావు, సీహెచ్. అగష్టస్‌బాబు, సీహెచ్. శ్రీనివాసరావు, పి. రమేష్ బాబు, ఎం. అప్పారావు, టి.శరత్, సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ఆటో డ్రైవర్లకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో శనివారం 'ఆటో డ్రైవర్ల సేవ'లో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పెదకూరపాడు నియోజకవర్గంలో 1,039 మందికి రూ. 1,55,85000 అందిస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లకు నేరుగా ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. సభకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నేతలు నల్లపాటి రాము, వెన్న సాంబశివరెడ్డి, ఆర్తిమల్ల రమేష్, ఎంపీపీ మేకల హనుమంతరావు, ఆర్డీవో రామదాసు, తహసీల్దార్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఆర్థికాభివృద్ధికి దోహదం



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: అసంఘటిత రంగంలో ఉన్న ఆటో కార్మికుల కోసం కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వారి కుటుంబాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో ఆటో డ్రైవర్ల సేవ పథకం ప్రారంభోత్సవంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని దసరా కానుకగా అందజేసేందుకు ప్రభుత్వం రూ.435 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఇప్పటికే రూ.1400 కోట్లు ఖర్చు చేసి గుంతల రహదారులకు మరమ్మతులు పూర్తి చేశామని చెప్పారు. ఆటో డ్రైవర్లు సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, రోజూ వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారని తెలిపారు. వారికి ఆర్థిక చేయూత ఇవ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం గౌరవ భృతి అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సత్తెనపల్లి నియోజకవర్గంలో 1,266 మంది లబ్ధిదారులకు రూ. 1.90 కోట్లు నమూనా చెక్కును అందించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ కోమటినేని శోభారాణి, టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, యెల్లినేడి రామస్వామి, షేక్ మస్తాన్‌వలి, మారెళ్ల మల్లేశ్వరరావు, చామర్తి ఆంజనేయులు, తోట అంబిక పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్లతో ప్రయాణికులకు అవస్థలు

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

అమరావతి: నియోజకవర్గంలో ధ్వంసమైన రోడ్లతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. రవిబాబు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా రోడ్ల నిర్మాణం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పుణ్య క్షేత్రమైన అమరావతికి దేశ విదేశాల నుంచి వచ్చే యాత్రికులు, ప్రయాణికులు, వాహనచోదకులు ధ్వంసమైన రోడ్లతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే వాగులు పొంగి ఐదారు రోజులపాటు మద్దూరు వాగు వద్ద అమరావతి– విజయవాడ రాకపోకలను నిలిపి వేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో అనాటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి యాభై శాతం పనులు పూర్తి చేశారని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన కూటమి ప్రభుత్వం బ్రిడ్జి పనులు మరలా ప్రారంభించక పోవడం దారుణమని పేర్కొన్నారు. అమరావతి– బెల్లంకొండ డబుల్ రోడ్డు నిర్మాణాన్ని నాటి శాసనసభ్యుడు నంబూరు శంకరరావు రూ. 149 కోట్లతో చేపట్టి సగభాగం పనులు పూర్తి చేసినట్లు వివరించారు. రోడ్లు పనులు సత్వరమే చేపట్టడంలో నేటి శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ వైఫల్యం చెందాడని విమర్శించారు. అమరావతి నుంచి క్రోసూరు, బెల్లంకొండ నుంచి పిడుగురాళ్ల వెళ్లాలన్నా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు, బ్రిడ్జి పనులు పూర్తిచేసి ప్రజలకు కష్టాలను తొలగించాలని రవిబాబు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బి. సూరిబాబు, నేతలు సయ్యద్ మొహిద్దీన్‌వలి, శంగారపాటి రాజకుమార్, ఎం. సుబ్రహ్మణ్యం నందూరి వెంకటేశ్వరరాజు, చెవుల మురారి, ఎస్కే నాగుల మీరా పాల్గొన్నారు

• పర్యావరణ వి'ధ్వంస రచన'

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి. మొక్కలు నాటటమే కాకుండా వాటిని సంరక్షించాలి. ఇవి ప్రజాప్రతినిధులు, అధికారులు సభలు, సమావేశాల్లో చేసే ఊకదంపుడు ప్రసంగాలు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎన్నో ఏళ్ల క్రితం నాటిన వృక్షాలను సైతం నరికేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో ఉన్న 'అన్న క్యాంటీన్'ను పునరుద్ధరించారు. దానికి అడ్డం లేకపోయినప్పటికీ తాలూకా సెంటర్‌లో 100 సంవత్సరాల కిందట నాటిన వేప చెట్టును నిలువునా కూల్చివేశారు. ఎక్కడికక్కడ ముక్కలు చేసి ట్రాక్టర్లలో తరలించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ తీగలకు కొమ్మలు అడ్డంకిగా ఉన్నాయంటూ నీడనిచ్చే వృక్షాలను సైతం కూల్చి వేయడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.

–సత్తెనపల్లి



చెట్టు కొమ్మలను ముక్కలు చేస్తున్న కూలీలు



పట్టణంలోని తాలూకా సెంటర్‌లో నరికేసిన వృక్షం మొదలు



వృక్షాన్ని నరికేసి ట్రాక్టర్‌లో లోడ్ చేసిన ముక్కలు

మెగా జాబ్‌మేళా

వినుకొండ : శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 6వ తేదీన ఉదయం 9.30గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ శనివారం తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలో జోసిల్, అమరరాజా బ్యాటరీస్, దీవిస్ లేబరేటరీస్, పెప్సీ కోలా వంటి 20 కంపెనీల వారు పాల్గొనున్నట్లు తెలిపారు.